కొలామి భాషకు అక్షర సేద్యం
తమ భాష, సంస్కృతి పరిరక్షణకు ఆదివాసీ కొలాం తెగ యువత ముందడుగు వేసింది. భాష, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు కృషి చేస్తోంది. 8లో▸



అడవుల పునఃసృష్టి
మైదానప్రాంతాలను దట్టమైన అడవులుగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ అధికారులు అధిక మొత్తంలో మొక్కలు నాటుతున్నారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.3 /26.3
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

వైద్య విద్యార్థికి విప్ ఆర్థికసాయం


విప్ బాల్క సుమన్‌తో విద్యార్థి అఖిల్

జైపూర్: మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన వైద్య విద్యార్థి సెగ్గం అఖిల్‌కు ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆర్థికసాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన అఖిల్‌కు రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండడంతో విషయం తెలుసుకున్న విప్ అఖిల్ ఉన్నత చదువుల కోసం రూ.70 వేలు అందించారు. ఈ సందర్భంగా అఖిల్, ఆయన కుటుంబ సభ్యులు బాల్క సుమన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విప్ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్‌కు రాజీనామా


మాట్లాడుతున్న ముజాహిద్

మందమర్రిరూరల్: ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పార్టీ శ్రేణులతో అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సుమారు 200 మంది బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ముజాహిద్, యూత్ నాయకులు శివ కిరణ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ కృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు రాజీనామాలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. బాల్క సుమన్ నియోజకవర్గాన్ని, ముఖ్యంగా మందమర్రి పట్టణాన్ని అభివృద్ధి చేస్తారని ఎన్నికల్లో గెలిపిస్తే మందమర్రి అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. ఎన్నికల ముందు మందమర్రి మున్సిపల్ ఎలక్షన్స్, 1/70 చట్టం రద్దు, పేదలకు భూ పట్టాలు ఇప్పిస్తానని ఇచ్చిన హామీలను మరిచారని మండిపడ్డారు. సమస్యలు చెప్పుకోవడానికి కనీసం నాయకులకు కూడా సమయాన్ని కేటాయించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

నియామక లేఖలు అందజేత



నియామక లేఖ అందిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా, మండల కాంగ్రెస్ బాధ్యులకు మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆదివారం నియామక లేఖలు అందజేశారు. హాజీపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తోట రవి వరుసగా మూడవసారి నియామకం అయ్యారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నంనూర్‌కు చెందిన రాసమల్ల శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్లు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: బదిలీలు, పదోన్నతుల కోసం ప్రిఫరెన్షియల్ కేటగిరీ పాయింట్ల కోసం ఉపాధ్యాయులు తమకు లేదా సంబంధీకులకు సూచించిన వ్యాధులు ఉంటే, జిల్లా స్పెషల్ మెడికల్ బోర్డు ప్రభుత్వ ఆసుపత్రి మంచిర్యాల నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకోవాలని డీఈవో యాదయ్య తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు సర్టిఫికెట్లు తీసుకోవాలని పేర్కొన్నారు. పిల్లలకు అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు కూడా సంబంధిత రిపోర్టు తీసుకుని మెడికల్ బోర్డు ప్రభుత్వ ఆసుపత్రి మంచిర్యాలలో మెడికల్ సర్టిఫికెట్లు పొందాలని వివరించారు.

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి


కార్మిక దీక్షలో మాట్లాడుతున్న రఘునాథ్

నస్పూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. సీసీసీ కార్నర్ వద్ద ఆదివారం చేపట్టిన కార్మిక దీక్షలో మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తానని 2016లో సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీ నేటికి అమలు కాలేదన్నారు.

వాన కురిసె చేను మురిసె


టేకుమట్ల వద్ద క్యాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


బక్కుగూడలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

- నెల రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు
- తాజా వానలతో పంటలకు ప్రాణం.. రైతుల మోములో ఆనందం
- పంటలకు మేలంటున్న వ్యవసాయాధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్/నెన్నెల: దాదాపు నెల రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలు ఎండిపోయే దశకు చేరుకుంటున్న పంటలకు ప్రాణం పోశాయి. శనివారం నుంచి ఆదివారం వరకు జిల్లాలో సగటున 9.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి జిల్లా అంతటా తేలికపాటి నుంచి మోస్తారు వర్షం కురిసింది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 323.1 మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా కేవలం 108.4 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పత్తి, కంది, మొక్కజొన్న, వరి పంటలకు నీటి తడులు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు ఊపిరి పోశాయి.

సాధారణం కన్నా తక్కువ..
జిల్లాలో జూలైలో సాధారణం కన్నా రెండు రెట్లు అధిక వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు జిల్లాలో 790.7 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం నమోదుకావాలి. ఇప్పటి వరకు 754 మిల్లీమీటర్లు కురిసింది. 5 శాతం లోటు నెలకొంది. తాండూర్, భీమిని, కన్నెపెల్లి, వేమనపల్లి, నెన్నెల మండలాల్లో 20 నుంచి 33 శాతం లోటు వర్షపాతం నమోదైంది. 13 మండలాల్లో సాధారణ వర్షం కురిసింది.

చెన్నూర్ నియోజకవర్గంలో భారీ వర్షం..
జైపూర్/భీమారం/కోటపల్లి: చెన్నూర్ నియోజకవర్గం పరిధిలోని జైపూర్, భీమారం, కోటపల్లి మండలాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. భీమారం మండలం మంచిర్యాల- చెన్నూరు జాతీయరహదారి నుంచి వెళ్లే జోడువాగులు ఉప్పొంగి ప్రవహిస్తోంది. వరదకు కోటపల్లి మండలం నక్కలపల్లి బమన్‌పల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన తెగిపోయింది. పార్‌పల్లి, లింగన్నపేట కల్వర్టు వద్ద వరద ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. జైపూర్ మండలం రసూల్‌పల్లి, ముదిగుంట, మిట్టపల్లి, కాన్కూర్, రామారావుపేట, ఇందారం, టేకుమట్ల, పెగడపల్లి, గంగిపల్లి, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, పొనూర్, శివ్వారం గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా అత్యధికంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు 83.8మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పెగడపల్లి ఈదులాగు, టేకుమట్ల పెద్దవాగు ఉప్పొంగి ప్రవహించాయి. లోలెవల్ వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంచిర్యాల-చెన్నూర్ 63వ నంబర్ జాతీయ రహదారిలోని రసూల్‌పల్లి వద్ద భారీగా వరద నీరు రోడ్డుపై చేరింది. చెన్నూర్ పట్టణానికి చెందిన తిరుపతిరెడ్డి కారు రసూల్‌పల్లి వద్ద వర్షానికి రోడ్డు పక్కన్న వేగంగా కరెంట్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టి సమీపంగా ఉన్న జాడి తిరుపతి ఇంట్లోకి దూసుకపోయింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. జాడి తిరుపతి ఇళ్లు ధ్వసమైంది. కారు ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో స్వల్పగాయాలతో ఆయన బయటపడ్డాడు. రసూల్‌పల్లి పెద్దవాగు ఉధృతంగా ప్రవహించింది. రోడ్డు, పంట పొలాలు నీటమునిగాయి.

హాజీపూర్‌లో వర్ష బీభత్సం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల, గుడిపేట గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోయాయి. ముల్కల్లకు చెందిన గుండు శ్రీనివాస్ ఇంటి పైకప్పు కొట్టుకుపోవడంతో నిరాశ్రయులయ్యారు. గుడిపేట జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న పలు చెట్లు కూలిపోయాయి. రోడ్డుకు అడ్డుగా వృక్షాలు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


ముల్కల్లలో గాలివానకు పైకప్పు లేచిపోయిన ఇంటి ఎదుట గుండు శ్రీనివాస్ కుటుంబం

హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో చెట్ల కొమ్మలు తొలగించి వేయించారు.

జన్నారంలో భారీ వర్షం


జన్నారం: మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం గంటపాటు కురిసిన భారీ వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. అంతర్గత రోడ్లు బురదమయమయ్యాయి. కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలోని బక్కుగూడకు చెందిన ఆత్రం అర్జు, టేకం కట్టి, టేకం రాజు, సిడాం మారుకు చెందిన మొక్కజొన్న పంటలు నేలవాలాయి.

మండలాల వారీగా నమోదైన వర్షపాతం

మండలం	వర్షం(మి.మీలలో)
జైపూర్	82.6
చెన్నూర్	80.4
భీమారం	61.5
వేమనపల్లి	52.3
లక్సెట్టిపేట	46.5
కోటపల్లి	45.2
జన్నారం	42.5
నస్పూర్	40
మందమర్రి	35.8
తాండూర్	34.8
హాజీపూర్	30.4
దండేపల్లి	27.5
భీమిని	24.8
బెల్లంపల్లి	24.3
నెన్నెల	22.8
కాసిపేట	22
మంచిర్యాల	21.8
కన్నెపల్లి	8.5


రసూల్‌పల్లిలో ఇంట్లోకి దుసుకెళ్లిన కారు


రసూల్‌పల్లి వద్ద రోడ్డుపై పారుతున్న వరద నీరు...


వర్షం కురవడంతో పత్తికి ఎరువులు వేస్తున్న కూలీలు

అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

రామకృష్ణాపూర్: జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. రెండో విడత ఓటరు జాబితా సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ఆదివారం సందర్శించారు. నూతన ఓటరు నమోదు, ఓటరు తొలగింపు, మార్పులు, సవరణల కోసం ఏర్పాటు చేసిన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వలస వెళ్లినవారితోపాటు చనిపోయిన ఓటర్లను గుర్తించి ఓటరు జాబితాలో మార్పులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ
మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్(గర్ల్స్), కార్మెల్ హైస్కూల్, మైన్స్ వొకేషనల్ ట్రెనింగ్ సెంటర్, సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సంతోష్ తనిఖీ చేశారు. బీఎల్‌వోల వద్ద ఉన్న ఓటరు జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితా సక్రమంగా ఉండేలా పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ చంద్రశేఖర్ ఉన్నారు.

కరాటే అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక


కరాటే అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: కరాటే అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నికలు జిల్లా కేంద్రంలోని చైతన్య పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా విజిగిరి రవి, ప్రధాన కార్యదర్శిగా మాటూరి శివ మహేష్, కోశాధికారిగా వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, వెంకటేష్, రాజేశ్, రహ్మతుల్లా, రాజ నర్సు, సతీశ్, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాస్, వెంకటేశ్, రాజేశ్, రవి, వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా విష్ణు, నరేశ్, లక్ష్మణ్, లీగల్ అడ్వయిజర్లుగా ఎండీ.రహ్మతుల్లా, ఉమెన్ కరాటే కన్వీనర్లుగా భారతి, గీత, చైతన్య, సౌమ్య, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా వెంకటేశ్, శ్రీనివాస్, సాగర్, రెఫరీ కమిషన్ సభ్యులుగా జితేందర్‌సాయి, మహేశ్, చైతన్యను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు ఆర్.మల్లయ్య, సబ్‌ఇన్‌స్పెక్టర్ సాగర్ పాల్గొన్నారు.

ఎన్ని రోజులు భరించాలి?

- కంపుకొడుతున్న డంప్ యార్డ్
- రెండు నెలల క్రితం చెత్త డంపింగ్‌ను అడ్డుకున్న ప్రజలు
- మరోచోటుకు తరలిస్తామని హామీ ఇచ్చిన మున్సిపల్ అధికారులు
- రెండు నెలలు గడిచినా తరలింపు ఊసేలేని వైనం..
- వర్షాలకు వ్యాధులబారిన పడుతున్నామంటున్న స్థానికులు


వాహనాలను అడ్డుకున్న కాలనీవాసులు (ఫైల్)

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ గ్రేడ్-1గా ఉన్నప్పటికీ చెత్త డంపింగ్‌యార్డుకు స్థలం లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో రోజుకు 44 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. అట్టి చెత్తను తరలించేందుకు స్థలంలేకపోవడంతో తడి, పొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు అండాళమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీసీ కేంద్రాన్నే డంపింగ్ యార్డుగా మార్చేశారు. దీంతో ఏరియా మొత్తం దుర్వాసన వెదజల్లుతుండడంతో ఇక్కడ చెత్త వేయనీయమని రెండు నెలల క్రితం కాలనీవాసులు చెత్తను తరలించే వాహనాలను అడ్డుకుని వారం రోజులపాటు ఆందోళనలు చేపట్టారు. ఎట్టకేలకు దిగివచ్చిన మున్సిపల్ అధికారులు రెండు నెలల్లోగా మరోచోటుకు డంపింగ్ యార్డును తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇప్పటికీ డంపింగ్ యార్డును తరలించలేదు.

తడి, పొడి చెత్తపై నిర్లక్ష్యం..
గతంలో ఊరికి దూరంగా అండాళమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డును మరో చోటుకు మార్చాల్సి ఉన్నా అధికారులు ఆ దిశగా శాశ్వత చర్యలు చేపట్టడంలేదు. డంపింగ్ యార్డులో డీఆర్‌సీసీ కేంద్రం ఉంది. ఇక్కడికి తీసుకొచ్చిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేస్తే చెత్త తగ్గిపోవడంతో పాటు ఆ ఎరువు పంటలకు ఉపయోగపడుతుంది. కానీ పట్టణ ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో ఇంటికి రెండు చెత్త డబ్బాలు ఇచ్చినా తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడం లేదు. డంపింగ్ యార్డులో వేస్తున్న చెత్తను రీయూజ్ చేయక పోవడంతో గుట్టలను తలపిస్తున్నాయి. అంతేకాకుండా చెత్తకు మంటలు అంటుకుని పొగలు వస్తుండడంతో సమీపంలోని ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అంతేకాకుండా దుర్వాసన భరించలేక పక్కనే ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ఇంటికి వెళ్లిపోవడంతో ఆ పాఠశాలను హాజీపూర్ మండలంలోని ముల్కల్లకు తరలిస్తున్నారు. డంపింగ్ యార్డును పొడి వనరుల సేకరణ కేంద్రం (డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్, డీఆర్‌సీసీ)గా అందులో ఉన్న రెండు షెడ్లను వినియోగించి తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మార్చే ప్రక్రియ చేపట్టడమే మార్గం.

స్థల కేటాయింపుతోనే..
మంచిర్యాల జిల్లాగా ఏర్పడక ముందు హాజీపూర్ మండలం వేంపల్లి శివారులో 21 ఎకరాల స్థలాన్ని డంపింగ్ యార్డు కోసం కేటాయించారు. ఆ ప్రాంతంలో పంట పొలాలు ఉండడంతో చెత్తను వేయవద్దంటూ గ్రామస్తులు హైకోర్టుకు వెళ్లారు. దీనిపై మున్సిపల్ పాలకవర్గం దృష్టి సారించక పోవడంతో డంపింగ్ యార్డు పోయింది. పట్టణ పరిసర ప్రాంతాల్లో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ వాటిపై అధికారులు, పాలకవర్గం దృష్టి సారించడం లేదు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పోచంపాడ్ గ్రామంలో పదెకరాల స్థలాన్ని గుర్తించినా ఇప్పటికీ అధికారికంగా మున్సిపాలిటీకి అప్పగించలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

స్థలం పరిశీలించాం



మంచిర్యాల మున్సిపాలిటీకి శాశ్వత డంపింగ్ యార్డు కోసం ముల్కల్ల వద్ద స్థలాన్ని పరిశీలించాం. మరికొద్ది రోజుల్లోనే ఆ స్థలం అప్పగించనున్నారు. వెంటనే చెత్త డంపింగ్ యార్డు పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. డీఆర్‌సీసీ కేంద్రంలో సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. తడి, పొడి చెత్త ను వేరుచేసి ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పిస్తాం.
– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

పంచాయతీలకు నిధులొచ్చాయ్..

- 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల
- పారిశుధ్యం, తాగునీటికి వినియోగించాలని నిబంధన


హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ పంచాయతీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామ పంచాయతీలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. జిల్లాకు రూ.5.70 కోట్ల నిధులు రావడంతో సర్పంచులకు కొంత ఊరట లభించింది. ట్రెజరీతో సంబంధం లేకుండా గ్రామ పంచాయతీల ప్రత్యేక ఖాతాల్లో నేరుగా నిధులు జమయ్యాయి.

జిల్లాలో 311 గ్రామ పంచాయతీలకు..
జిల్లాలోని 16 మండలాల్లో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో దాదాపు 6 లక్షల వరకు జనాభా ఉంది. తాజాగా ఆర్థిక సంఘం నిధులు రూ.5,70,97, 480 విడుదలయ్యాయి. గ్రామ పంచాయతీల అభివృద్ధికి విడుదల చేసిన ఈ నిధులను పారిశుధ్య నిర్వహణ, తాగునీటి నిర్వహణకు వినియోగించాలని నిబంధన విధించారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఈ నిధులు వినియోగించేందుకు ఎలాంటి అవకాశం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు డ్రా చేయడానికి ఎలాంటి ఆంక్షలు కూడా లేవు. బ్యాంకు ఖాతాలను పబ్లిక్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(పీఎఫ్ఎంఎస్)కు అనుసంధానం చేయడం వలన ఫ్రీజింగ్‌కు ఎలాంటి అవకాశం లేదు.

నిబంధనల మేరకు ఖర్చు చేయాలి



కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల ప్రత్యేక ఖాతాల్లో జమ అవుతాయి. జిల్లాకు మంజూరైన రూ. 5.70 కోట్ల నిధులను సర్పంచులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.
– వెంకటేశ్వర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

నేటి నుంచి మంచిర్యాలలో రిలే దీక్షలు

దండేపల్లి: తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న 17 విభాగాల ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈనెల 4 నుంచి 11 వరకు రిలే దీక్షలు చేపట్టనున్నారు. మంచిర్యాలలో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టే రిలే దీక్షలో 17 విభాగాల్లోని 596 మంది ఉద్యోగులు పాల్గొననున్నట్లు జేఏసీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిలే దీక్షలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆటలు ఆడేదెలా?

- మూడేళ్ల తర్వాత ఆటల పోటీలకు సన్నాహాలు
- స్కూల్ గేమ్స్ నిర్వహణకు నిధుల కొరత


క్రీడాపోటీల్లో క్రీడాకారులు (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏటా పాఠశాల స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. సర్కారు పాఠశాలలకు క్రీడాసామగ్రి కొనుగోలు చేసేందుకు గ్రాంటు విడుదల చేస్తున్న ప్రభుత్వం పోటీల నిర్వహణకు మాత్రం నిధులు ఇవ్వడం లేదు. దీంతో పోటీలు ఎలా నిర్వహించాలో తెలియక ఎస్‌జీఎఫ్ కమిటీ సభ్యులు తలలు పట్టుకుంటున్నారు.

ఐదు టోర్నీలకు ప్రతిపాదన..
రాష్ట్రస్థాయి టోర్నీల కోసం మంచిర్యాల జిల్లా నుంచి ఫుట్‌బాల్ గర్ల్స్, చెస్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇందుకు ఆమోదం లభిస్తే ఈఐదు టోర్నీలు ఇక్కడ నిర్వహిస్తారు. ఈ ఏడాది జూలైలో స్పోర్ట్స్ నిధులు మంజూరయ్యాయి. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంటు యుటిలైజేషన్ గైడ్‌లైన్స్ జారీ చేసింది. 1 నుంచి ఐదో తరగతి, 6 నుంచి 8వ తరగతి, 9 నుంచి 12 వతరగతి వరకు సమగ్రశిక్ష కింద ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ కోసం క్రీడా పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, సాఫ్ట్‌బాల్, టెన్నిస్‌బాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, తదితర పరికరాలు కొనుగోలుకు ప్రాథమిక పాఠశాలలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.10 వేల చొప్పున నిధులు కేటాయించారు.

వెక్కిరిస్తున్న ఖాళీలు..
జిల్లాలో 108 ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. 39 పీఈటీ, 18 పీడీ పోస్టులు మంజూరు చేశారు. ప్రస్తుతం 36 మంది పీఈటీలు, 17 మంది పీడీలు పనిచేస్తున్నారు. 51 ఉన్నత పాఠశాలలకు పోస్టులు మంజూరు కావాల్సి ఉంది. ఒకవైపు ఖాళీలు.. మరోవైపు ఆటల పోటీల నిర్వహణకు నిధులు మంజూరు కాకపోవటంతో క్రీడలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

మొదటి విడత 50 శాతం నిధులు..
ఈ విద్యా సంవత్సారానికి సంబంధించిన క్రీడా నిధులు మొదటి విడతలో 50 శాతం మంజూరయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలోని 1,098 పాఠశాలలకు రూ.32,65,000, కుమురంభీం జిల్లాలోని 937 పాఠశాలలకు రూ.27,15,000, మంచిర్యాల జిల్లాలోని 720 పాఠశాలలకు రూ.22,80,000, నిర్మల్ జిల్లాలోని 719 స్కూళ్లకు రూ.22,75,000 మంజూరయ్యాయి.

మూడేళ్లుగా ఎదురుచూపులే..
జిల్లాస్థాయిలో ఎస్‌జీఎఫ్ పోటీలకు నిధులు మంజూరు కావడంలేదు. దీంతో దాతల సహకారం, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ, పీఈటీ, పీడీ సొంత డబ్బులతో పోటీలు నిర్వహించాల్సి వస్తోంది. 2019, 2020లో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు సంబంధించిన నిధులు ఇప్పటికీ మంజూరు చేయలేదు. దీంతో ఈ సంవత్సరం పోటీల నిర్వహణకు ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

క్లుప్తంగా

పిడుగుపడి విరిగిన చెట్టు



రైల్వే కాలనీలో విరిగిపడిన చెట్టు

బెల్లంపల్లి: పట్టణంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి రైల్వేకాలనీలోని ఆర్‌ఓహెచ్ ప్లాంట్ సమీపంలో ఉన్న ఓ చెట్టుపై పిడుగు పడింది. చెట్టు విరిగి కిందపడిపోగా కొమ్మలు పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై వాలడంతో మంటలు చెలరేగి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమీపంలోని పలు క్వార్టర్లలో ఎలక్ట్రానిక్ గృహోపకరణ వస్తువులు కాలిపోయాయి.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

నెన్నెల: కడుపు నొప్పి భరించలేక మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై శ్యాం పటేల్ కథనం ప్రకారం.. మండలంలోని కుశ్నపల్లికి చెందిన బద్ది సుక్కక్క(55) మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. చికిత్స తీసుకున్నా, నెల రోజులుగా మందులు వాడుతున్నా ఎంతకీ కడుపునొప్పి తగ్గలేదు. ఆదివారం ఉదయం భర్త పశువులు మేపడానికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమెకు తీవ్ర కడుపునొప్పి రావడంతో భరించలేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. భర్త హన్మంతు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు

రెబ్బెన(ఆసిఫాబాద్): పురుగుల మందు తాగి రిటైర్డ్ సింగరేణి కార్మికు డు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై లక్ష్మణ్ కథనం ప్రకారం.. మండలంలోని గోలేటి విలేజ్‌కు చెందిన బానోత్ రూప్లా (65) గత కొంతకాలంగా కడుపునొప్పి, ఊపిరితిత్తుల సమస్య తో బాధపడుతున్నాడు. ఆసుపత్రులకు వెళ్లినా ఆరోగ్యం కుదుటపడలేదు. జీవితంపై విరక్తితో శనివారం రాత్రి ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన పెద్దకుమారుడు రవినాయక్ రెబ్బెన పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుమారుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

హత్యకేసులో ఇద్దరి అరెస్ట్

చెన్నూర్:పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో మడక తిరుపతి (35)ని హత్యచేసిన భార్య సౌందర్య, అత్త లక్ష్మిని ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామన్నారు.


108లో ప్రసవం



శిశువును అప్పగిస్తున్న సిబ్బంది

కోటపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బుల్లె సౌందర్యకు ఆదివారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువకావడంతో సిబ్బంది వాహనంలోనే సుఖప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ శాహెబాజ్, పైలెట్ ఫరీద్ తెలిపారు.

కొలామి భాషకు అక్షర సేద్యం



Wp/nit/జవహర్ లాల్ నెహ్రూ

కొలామి వికీపీడియాలో నెహ్రూ సమాచారం



Wp/nit/సాయిఖోమ్ మీరాబాయి చాను

కొలామి వికీపీడియాలో మీరబాయి చాను సమాచారం

- అంతరించకుండా యువత కృషి
- వికీపీడియాలో కొలామి భాష
- సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు కృషి
- భాష సంరక్షణలో యువత



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికీపీడియా శిక్షణ తరగతులు

ఉట్నూర్‌రూరల్: ఆధునిక కాలంలో కాలానుగుణంగా తమ భాష, సంస్కృతి ఎక్కడ కనుమరుగవుతుందేమోనన్న తపనతో ఆదివాసీ కొలాం తెగ యువత ముందడుగు వేసింది. కొలామి భాష, తమ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఆలోచనతో వికీపీడియాను వేదికగా ఎంచుకున్నారు. భవిష్యత్ తరాలకు తమ భాష, సంస్కృతి, పదజాలం, జానపద పాటలు, నృత్య కళారూపాలు, చారిత్రాత్మక అస్తిత్వ పరిరక్షణకు తమ వంతు పాత్ర పోషిస్తూ తెలుగు లిపితో కొలాం భాషను వికీపీడియాలో పొందుపరుస్తూ.. పలువురు మన్ననలు పొందుతూ కొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఇది వరకే ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఐటీడీఏ పీవో పాల్గొని కొలామి భాషను వికీపీడియా ద్వారా ప్రపంచానికి తెలియచేయడంపై ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి బోలిచేతో (భాష చైతన్యం) ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు.

కొలాం తెగకు చెందిన యువకులు, కళాకారులు తమ నైపుణ్యాన్ని వెలికితీసి భాషను నేరుగా వికీపీడియాలోకి మార్చి తమ ఔనత్యాన్ని చాటుతున్నారు. కొలామి భాషతో పాటు మహానీయులు, క్రీడాకారులు, రాజకీయ నాయకుల చరిత్రను కొలామిలో పొందుపర్చేందుకు సిద్ధమవుతున్నారు.

ఆదివాసీల్లో అత్యంత వెనుకబడిన తెగ...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 46,677 మంది కొలాం జనాభా ఉన్నారు. ఆదివాసీ తెగల్లో అత్యంత వెనుకబడిన తెగ ఆదివాసీ కొలాం. వారి సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నంగా ఉంటాయి.

కొలాం సంస్కృతి

గిరిజన తెగల్లో కొలాం సంస్కృతి, ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉంటాయి. కొలాం ఆదివాసీలు కొలిసే ఆరాధ్యదైవం భీమయ్యక్, నడిదమ్మ, ముత్తేలమ్మ, దండారీ, దూరడి, పాలకమ్మ దేవతలు ముఖ్యమైనవి. వివాహ వేడుకల్లో పాడే జానపదులు ప్రత్యేకంగా ఉంటాయి. కొలాం మహిళలు, పురుషులు ఉత్సవాల సందర్భంగా కొలామి మాతృభాషలో పాడే పాటలు, నృత్య కళారూపాలను కాలానుగుణంగా వివిధ ఉత్సవాలకు సంబంధించిన నృత్యాలు సేకరించి పొందుపర్చనున్నారు.



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయి (ఫైల్)



ఫౌండేషన్ వికీపీడియా సభ్యులు

వికీపీడియాలోకి..

KOLAMI WIKIPEDIA

తెలుగు లిపిని అలంబన చేస్తూ కొలామి భాషకు జీవం పోసి వందలాది వ్యాసాలతో ముందుకు సాగుతూ అంతర్జాతీయ వేదికగా నిర్మితమవుతున్న కొలామి వికీపీడియా అక్షర సేద్యంగా నిలువనుంది. కొలాం తెగ ప్రజలు రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, మహారాష్ట్రలో యావత్మల్ జిల్లాలో నివసిస్తున్నారు. వీరిది ద్రావిడ భాష అయినా కొలామి భాషను మాట్లాడతారు. ప్రభుత్వ రికార్డుల్లో కొలామ్స్ అని నమోదు చేసింది.

కొలామి వికీపీడియా ప్రస్థానం

కొలామి వికీపీడియాను జూన్ 28న నేతి సాయి కిరణ్ ప్రారంభించారు. ప్రపంచంలో లిపి లేని ఆదివాసీ భాషలు రోజురోజుకూ అంతరించిపోతున్నాయి. భాష పదజాలం కోసం సంస్కృతి పరిరక్షణకు బోలిచేతో ఫౌండేషన్ స్థాపించారు సాయికిరణ్. భాష కోసం, ఆదివాసీలు సంస్కృతిక పంటలైన చిరుధాన్యాల బాహ్య ప్రపంచానికి తెలియచేసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

భవిష్యత్‌కు కొలామి వికీపీడియా అవసరం



“ తెలుగు వికీపీడియాలోని తెలంగాణలోని జిల్లాలు, మండలాలు, గ్రామాలకు సంబంధించిన సమాచారాన్ని కొలామి భాషలో అనువాదం చేస్తున్నాం. సమకాలిన అంశాలపై రచనలు కొనసాగుతున్నాయి. వికీ బుక్స్‌లో నేను రచించిన కొలాం వీరుడు కుమురం సూరు, దండారీ కైతికాలు, దంతన్‌పల్లి భీమయ్యక్ మహాత్మ్యం, మోతీరాము శతకం పుస్తకాలు పొందుపర్చుతాను.

– ఆత్రం మోతీరాం, కొలామి వికీపీడియా, కవి

మా జీవన విధానాన్ని వికీలో భద్రపరుస్తాం



“ మా కొలాం సంస్కృతికి సంబంధించిన వ్యవహారాలు, దేవుళ్ల, జానపద నృత్యాలు, పాటలు, మా చరిత్రాత్మక స్థానాలు, మా జీవన విధానం, పల్లెలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సేకరించి వికీ కామన్స్‌లో భద్రపరుస్తాను.

ఆత్రం రాజ్‌కుమార్, కొలామి వికీపీడియా

ఇష్టంతో అనువాదం



“ తెలుగు వికీపీడియాలోని సమాచారాన్ని కొలామి భాషలో అనువాదం చేయడం నాకెంతో ఇష్టం. జాతీయ నాయకులకు సంబంధించిన సమాచారాన్ని కొలామి భాషలో తెలుగు లిపితో అనువాదం చేస్తున్నాం. మా మాతృభాష కొలామి భాషకు సేవా చేయడం నాకెంతో గర్వకారణం.

– మడావి జంగు, కొలామి వికీపీడియా

అంతరిస్తున్న భాషలపై పరిశోధన



“ యునెస్కో ప్రకారం ప్రపంచంలో 7వేలకు పైగా భాషలు వాడుకలో ఉన్నాయి. ఈ జాబితాలోని చాలా భాషలు అంతరిస్తున్నాయి. వైవిధ్యంగా ఉన్న భాషలు ప్రపంచ భాష వైవిధ్యతను కోల్పోయే దిశలో ఉన్నాయి. భాషను డిజిటల్ మాధ్యమాల ద్వారా పునరుద్ధరణ చేయడమే నా లక్ష్యం.

– నేతి సాయికిరణ్, తెలుగు వికీపీడియా, బోలిచేతో ఫౌండేషన్, వ్యవస్థాపకుడు, అస్సాం

శబరిమల సమాచార కేంద్రం ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న బేతి తిరుమల్‌రావు

నస్పూర్: కేరళ ట్రావన్ కోర్ బోర్డును సంప్రదించి జిల్లా కేంద్రంలో శబరిమల సమాచార కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ (ఏబీఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు తెలిపారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఏబీఏపీ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో డిసెంబర్‌లో 5 వేల మంది అయ్యప్పస్వాములతో మహాసంఘం పూజ నిర్వహిస్తామన్నారు. నవంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహించే మహా సంఘం పూజకు భక్తులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొండు నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి పుల్లం రాజు, జాతీయ కార్యవర్గ సభ్యులు కొండ శ్రీనివాస్, కోర్ కమిటీ సభ్యుడు భాస్కర్ల రాజేశం, సభ్యులు మట్టపల్లి సంపత్‌రావు, కృష్ణ, వజ్రవేలు, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలిపోయిన గుడిసెల పరిశీలన



పరిశీలిస్తున్న లక్ష్మి, తదితరులు

చెన్నూర్‌రూరల్: పేదల గుడిసెలు కాలిపోతే ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తోందని మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య అన్నారు. మండలంలోని బావురావుపేట సమీపంలో కాలిపోయిన గుడిసెలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల గుడిసెలను కాల్చేస్తుంటే రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ దారుణానికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు దాసరి రాజేశ్వరి, చందు, ఎండీ అవేజ్ తదితరులు ఉన్నారు.

'రాబోయేది డబుల్ ఇంజన్ సర్కార్'

జన్నారం: రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని కవ్వాల్, బంగారు తండాలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన పర్యటించారు. పలువురు యువకులు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. రాథోడ్ రమేశ్ మాట్లాడుతూ కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలు, పథకాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నాయకులు గోలి చందు, శంకర య్య, మధుసూదన్‌రావు, శివలింగయ్య, జగన్, రాజేశ్, రాకేశ్, సాయిశ్రీనివాస్, దేవేందర్, శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీక్లీనర్ మృతి

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీక్లీనర్ దిలీప్‌కుమార్ (33) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు..యాష్ లోడింగ్ కోసం వచ్చిన ట్యాంకర్లు, లారీలు రోడ్డుపై వరుసగా ఉన్నాయి. దిలీప్‌కుమార్ తన లారీ టోకెన్ కోసం లోడింగ్ పాయింట్ వద్ద వెళ్లి తిరిగి వస్తున్నాడు. మరో లారీ యాష్ లోడ్ చేసుకుని వస్తుండగా దిలీప్‌కుమార్ భయంతో పరుగెత్తగా కిందపడిపోయాడు. ముందు వరుసలో లోడింగ్‌కు సిద్ధం ఉన్న లారీ ఆయన తలపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఏసీపీ మోహన్, సీఐ రమేశ్‌బాబు పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజీజ్ తెలిపారు.

రెండు కార్లు ఢీ

జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్ రోడ్డు సమీపంలో గల రాజీవ్‌రహదారిపై ఆదివారం రెండు కార్లు ఢీ కొన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన డాక్టర్ టి.విక్రమ్ కారులో మంచిర్యాల వైపు వస్తున్నారు. సీసీసీ సీతరాంపల్లికి చెందిన సాయికృష్ణ గోదావరిఖని వెళ్లి తిరిగి వస్తుండగా వర్షానికి ముందువెళ్లే వాహనం కనిపించక వెనుక వైపు నుంచి విక్రమ్ కారును ఢీకొన్నాడు. ఈ ఘటనలో రెండ్లు కార్లు ధ్వంసం కాగా వారిద్దరూ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నాగరాజు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బెల్లంపల్లి: తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య కథనం ప్రకారం.. మున్సిపాలిటీ షంషీర్‌నగర్ బస్తీలో నివాసం ఉంటున్న సామల రాజ్‌కుమార్ ఇంటికి తాళం వేసి శనివారం సాయంత్రం మందమర్రిలో తన చెల్లె వద్దకు వెళ్లాడు. తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగదును ఎత్తుకెళ్లారు. రాజ్‌కుమార్ తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగినట్లు గ్రహించాడు. ఇంటి వెనుక తలుపు తాళం పగులగొట్టి తన బ్యాగులో రూ.3.20 లక్షల నగదు పట్టుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు మేకలు మృతి

తాండూర్: మండలంలోని రేచినీ పంచాయతీ పరిధి బలాహన్‌పూర్‌కు చెందిన రాలి చీకటి, దూలం కిరణ్‌కు చెందిన రెండు మేకలు విద్యుదాఘాతానికి మృతిచెందాయి. అడవిలో మేతకు వెళ్లి ఆదివారం సాయంత్రం వస్తుండగా వర్షం కురుస్తుంది. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం వద్ద కిందపడిపోయిన కరెంట్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. అధికారులు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

హైనా దాడిలో మేక మృతి

బెజ్జూర్: హైనా దాడిలో మేక మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నికాడి మల్లయ్యకు చెందిన మేక ప్రతిరోజులాగే శనివారం మేత కోసం వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆదివారం అడవిలో గాలించగా మృతిచెంది ఉంది. మేకను హైనా దాడి చేసి హతమార్చిందని గొర్రెల కాపర్లు తెలిపారు.

యువకులను కొట్టిన నిందితుల రిమాండ్



మాట్లాడుతున్న ఏసీపీ పంతాటి సదయ్య

మందమర్రిరూరల్: మేక దొంగతనం చేశారని ఆరోపిస్తూ కాళ్లపైకి కట్టేసి కింద మంటపెట్టి ఇద్దరు యువకులను తీవ్రంగా కొట్టిన కేసులో నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య తెలిపారు. ఆదివారం మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మేకల దొంగతనం చేశారనే ఆరోపణతో పట్టణంలోని యాపల్ ప్రాంతానికి చెందిన తేజ, కిరణ్ అనే యువకులను అదే కాలనీకి చెందిన రాములు, అతడి కొడుకు శ్రీనివాస్, భార్య స్వరూప, పనిమనిషి నరేష్ తీవ్రంగా కొట్టారని తెలిపారు. అవమానం భరించలేక దళితుడైన కిరణ్ శుక్రవారం సాయంత్రం కనిపించకపోవడంతో కిరణ్ చిన్నమ్మ నిట్టూరి సరిత ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. రాములు, శ్రీనివాస్, స్వరూపలను శనివారం, నరేష్ ఆదివారం అదుపులోకి తీసుకొని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. కిరణ్ కోసం నాలుగు పోలీస్ బృందాలు ఏర్పాటు చేసి వెతకగా, సాయంత్రం అతన్ని పట్టుకుని కుటుంబీకులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. ప్రతీ నెల 30న మానవ హక్కుల విలువలపై సదస్సులను ఏర్పాటు చేసి కుల వివక్షపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మందమర్రి ఎస్సై చంద్రకుమార్, సిబ్బంది ఉన్నారు. కాగా, నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేశ్ డిమాండ్ చేశారు. కిరణ్ వాళ్ల చిన్నమ్మ నిట్టూరి సరిత ఇంటికి వెళ్లి ఈ ఘటనపై అడిగి తెలుసుకున్నారు. వరుణ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సూర్య ఉన్నారు.

పాతమంచిర్యాల: మేకల యజమాని రాములుపై చర్య తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేఖ పోరాటసంఘం జిల్లా కార్యదర్శి మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. లేకపోతే బాధితుల పక్షాన పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు'



మాట్లాడుతున్న మోహన్‌జోషి

మంచిర్యాలటౌన్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు ఖాయమని పెద్దపల్లి పార్లమెంట్ పరిశీలకుడు మోహన్‌జోషి ధీమా వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంలోని మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు నివాసంలో పార్టీ నియోజకవర్గ ముఖ్యనేతలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టంగా ఉందని, డిజిటల్ నమోదు ప్రక్రియలో ప్రేంసాగర్‌రావు దేశంలోనే ప్రథమ స్థానంలో నిలువడం అభినందనీయమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ప్రేంసాగర్‌రావు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో చెన్నూర్ బెల్లంపల్లి నియోజకవర్గాల నాయకులతో సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, పీసీసీ అధికార ప్రతినిధి వెంకటరమణ, యువజన కాంగ్రెస్ పరిశీలకుడు వినోద్‌పటేల్ పాల్గొన్నారు.

మంచిర్యాలలో 'మహా' ఉల్లి



రోజురోజుకూ ఉల్లిగడ్డ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. మంచిర్యాలలో ఎర్ర ఉల్లిగడ్డ రూ.35 వరకు పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఐబీ చౌరస్తాలో మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ఓ వ్యాపారి ఉల్లిగడ్డ లోడ్ లారీని ఆదివారం తీసుకువచ్చారు. కేవలం 10 కిలోలకు రూ.200కే విక్రయించడంతో ప్రజలు ఎగబడ్డారు. మార్కెట్ కంటే తక్కువ ధర కావడంతో గంటల వ్యవధిలో లారీ లోడ్ ఖాళీ అయింది. – మంచిర్యాలఅర్బన్